

పరిచయ సమీక్ష

- నేడు కలెక్టరేట్ వేదికగా కార్యక్రమాలు
- జిల్లా అధికారులతో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ
- అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై సమీక్ష.. నిధులపై ఆరా

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్, జేసీ తదితర అధికారులు మారారు. ఈ క్రమంలో అటు ఎమ్మెల్యేలు, ఇటు జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం కలెక్టరేట్ వేదికగా బుధవారం జరగనున్నది. దీనికి జిల్లాలోని ఇద్దరు మంత్రులతో పాటు కొత్తగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ హాజరుకానున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఇప్పటికే నాలుగు వారాలు దాటినా జిల్లా స్థాయి అధికారులకు ఎమ్మెల్యేలతో ఇంతవరకు పరిచయ కార్యక్రమం జరగలేదు. అధికారుల బదిలీలు జరిగాక ఈ కార్యక్రమం పెట్టుకోవాలని తొలుత భావించారు. కానీ దానికి మరికొస్త సమయం పట్టే అవకాశం ఉన్నందున పరిచయ కార్యక్రమాన్ని ముందుగానే ఏర్పాటు చేశారు. దీనితో పాటు ప్రధాన విభాగాలకు సంబంధించి పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి

ఇద్దరు మంత్రుల సహా..

జిల్లాలోని ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు, నక్కా ఆనంద్‌బాబు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు ఈ పరిచయ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కలెక్టర్ వెంకటమురళితో పాటు ఆయా విభాగాల అధికారులందరూ ఈ ముఖాముఖిలో భాగం కానున్నారు. పరిచయ కార్యక్రమం అనంతరం జిల్లాలో తక్షణం చేపట్టాల్సిన పనులపై మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని సమాచారం. ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో కాల్వల్లో పూడికతీత పనులపై దృష్టిసారించే విధంగా యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వనున్నారు. ఎరువుల లభ్యత, రైతులకు రుణాలు లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం దక్కనుంది. ఆయా విభాగాలలో నిధుల లభ్యతపై ఆరా తీయనున్నారని తెలుస్తోంది.

అధికారుల కసరత్తు...

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక జరగనున్న తొలి సమావేశం కానుండడంతో వివిధ విభాగాల అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావడానికి కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ, ఇరిగేషన్‌తో పాటు ఆర్ అండ్‌బీ విభాగాలు బుధవారం నాటి సమీక్షలో కీలకంగా ఉండనున్నాయి. మంత్రులు కూడా హాజరవనుండడంతో వారి ముందుకు ఆయా శాఖలు ఎదుర్కొంటున్న నిధుల సమస్య కూడా ఏకరువుపెట్టే విధంగా నివేదికలు తయారు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసానికి సంబంధించి ఒక్కొక్క విభాగం మీద శ్వేతపత్రం విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే విధానాన్ని జిల్లా స్థాయిలో అవలంబించే విధంగా వివరాలు అడిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుకలో జరిగిన దోపిడీ ఎంత అనే అంశంతో పాటు అసైన్ భూముల బాగోతంపై కూడా సమగ్ర వివరాలను ప్రజల ముందుంచి తదుపరి చర్యలకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



మాచర్లలో ఐదేళ్లు పనులు చేయకుండా వదిలేసిన టిడ్కో గృహాలు

టిడ్కో.. కసరత్తు

పేదలకు గృహయోగం.. కసరత్తు మొదలైంది. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను జగన్ ఐదేళ్లు పాడుపెట్టగా.. వాటిని పూర్తి చేసి పంపిణీ చేసే బాధ్యత కూడా చంద్రబాబే చేపట్టారు. 2014లో నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పేదల కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను మున్సిపల్ కేంద్రాల్లో నిర్మించారు. పేదల సొంతింటి కల సాకారమవుతుందనే సమయంలో 2019లో ప్రభుత్వం మారింది. వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే టిడ్కో ఇళ్లను అర్థాంతరంగా నిలిపి వేశారు. అప్పటికే పూర్తై.. గృహ ప్రవేశాలు జరిగిన ఇళ్లలో కూడా అరకొర పనులను ప్రభుత్వం పట్టించుకోకుండా ఐదేళ్లు కాలయాపనతో సరిపెట్టింది. ఒకవైపు టిడ్కో ఇళ్ల కోసం అప్పులు చేసి దానికి వడ్డీలు కడుతూ.. మరోవైపు అద్దె భారంతో పేదలు అల్లాడుతున్నా.. జగన్ ప్రభుత్వం పట్టించుకోకుండా అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తూ వచ్చింది. ఇక జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా తమకు టిడ్కో రావని పేదలు నిర్ణయించేసుకున్నారు. ఈ దశలో తాజా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నేతృత్వంలో అధికారం చేపట్టింది. దీంతో పేదలు తమకు గృహయోగం కలుగుతుందని ఆశించారు. వారి ఆశలకు తగినట్లుగానే టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మార్చి నాటికి టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి పేదల గృహయోగం సాకారం చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు.

పేదలకు గృహయోగం దిశగా..


- గృహాల పూర్తికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రూ.917 కోట్ల నిధులు మంజూరుకు అంగీకారం
- మార్చికల్లా 10,240 టిడ్కో ఫ్లాట్లు పంపిణీకి చర్యలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా సొంత ఇంటి కోసం పేదలు కంటున్న కలలను కూటమి ప్రభుత్వం సాకారం చేసేందుకు సిద్ధమైంది. దీంతో పట్టణాల్లో పేదలు సొంత ఇంటి కల నెరవేర్చే దిశగా అధికారులు అడుగులు మొదలు పెట్టారు. ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ అనేక రకాలుగా అవస్థలు పడిన పట్టణ పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. అదే వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టగానే రివర్స్ టెండర్ల పేరుతో దానిని తుంచేసింది. టీడీపీ హయాంలో చేపట్టిన వేలాది టిడ్కో గృహాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాడుబెట్టింది. టిడ్కో ఇళ్ల నిధుల కేటాయింపును కూడా విస్మరించింది. ఈ పరిస్థితుల్లో తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసేందుకు సమాయత్తమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 10,240 గృహాలు పూర్తి చేసి వచ్చే మార్చి కల్లా పేదలకు గృహయోగం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టిడ్కో గృహాలను పూర్తి చేసి పంపిణీ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. టిడ్కో ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబునాయుడుతో మంగళవారం భేటీ అయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంపై దృష్టి సారించాలని టిడ్కో అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, రేపల్లె, వెంగళాయపాలెం, తెనాలిలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం సమాయత్తమైంది. చంద్రబాబు హయాంలో చేపట్టిన టిడ్కో గృహాలను తిరిగి తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వమే పూర్తి చేసి పేదల కల సాకారం చేయనున్నది. వైసీపీ ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేసిన వేలాది గృహాల పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం నడుం కట్టింది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పేదల్లో సొంత ఇంటిపై ఆశలు చిగురిస్తున్నాయి. నిలిచిపోయిన గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణ బకాయిలను చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇళ్ల నిర్మాణం పూర్తితో పాటు మౌలిక వసతులను కల్పిస్తారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తారు. ఆయా పనులు పూర్తి చేసేందుకు, బకాయిలు చెల్లింపునకు రూ.917 కోట్లు అవసరం అవుతుందని ప్రతిపాదనలను టిడ్కో నుంచి ప్రభుత్వానికి అందాయి. మొత్తం 10,240 గృహాలను పూర్తి చేసి అన్ని వసతులు కల్పించి మార్చి కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

కక్షగట్టిన వైసీపీ ప్రభుత్వం

పేదలపై వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టినట్లుగా టిడ్కో గృహాలను పూర్తి చేయలేదు. గృహాలను పంపిణీ చేయాలన్న పేదల మొరను పాలకులు వినిపించుకోలేదు. పనుల పూర్తి మాట ఎలా ఉన్నా నిర్మాణంలో ఉన్న గృహాలను గత ప్రభుత్వం బ్యాంకుల్లో తనఖా పెట్టింది. ఆ రుణాలతో పనులు చేయలేదు. పైగా ఆ నిధులను జగన్ ప్రభుత్వం మళ్లించుకున్నట్లు సమాచారం. టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని టీడీపీ సహా ఇతర ప్రతిపక్షాలు, లబ్ధిదారులు ఆందోళనలు చేసినా నాటి పాలకులు పట్టించుకోలేదు. ఇళ్లు శిథిలమవుతున్నాయని, అసాంఘీక కార్యకలపాలకు నిలయాలుగా మారుతున్నాయని లబ్ధిదారులు వాపోయినా నిర్లక్ష్యం వీడలేదు. పండుగల పేర్లు చెబుతూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను ప్రభుత్వం మభ్యపెడుతూ వచ్చింది. ఎన్నికలకు ముందు తొమ్మిది నెలల క్రితం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అయితే టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించకుండా ప్రజా ప్రతినిధులు హడావుడితో సరిపెట్టారు.



వినుకొండలో టిడ్కో గృహాలు

పట్టణాల వారీగా పూర్తి చేయనున్న గృహాలు..

పట్టణం	గృహాల సంఖ్య
మాచర్ల	1056
వినుకొండ	1440
పిడుగురాళ్ల	2832
సత్తెనపల్లి	160
చిలకలూరిపేట	1008
వెంగళాయపాలెం	1392
తెనాలి	1008
రేపల్లె	1344

నాలుగున్నరేళ్లు నాన్చారు

టీడీపీ హయాంలో దాదాపు 90 శాతం పూర్తయిన ఇళ్లకు తుది మెరుగులు దిద్ది, మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లు నాన్చివేత ధోరణి అవలంబించింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని టిడ్కో ఇళ్ల పంపిణీ 2019లో ఆగి పోయింది. అప్పటి నుంచి ప్రభుత్వం 2023 మే వరకు ఇళ్ల పంపిణీ చేసే యోచన చేయలేదు. కట్టిన ఇళ్లు శిథిలమవుతున్నాయని ప్రతిపక్షాలు, లబ్ధిదారులు ఆందోళనలు చేసినా ఆలకించలేదు. ఎన్నికల ఏడాది ప్రారంభంలో చేపట్టిన ఇళ్ల పంపిణీ హడావుడితోనే సరిపోయింది. సదుపాయాల కల్పన చేయకుండా పట్టాల పంపిణీతో జగన్ మాయ చేశారని అప్పట్లో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లయితే పంపిణీ చేశారుగాని నివాసాలకు కావాల్సిన కనీస వసతులను కూడా కల్పించలేదని ఇదే నాటి జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమని లబ్ధిదారులు తెలిపారు.

సీడ్ యాక్సెస్.. సవాల్



సీడ్ యాక్సెస్ రోడ్డు

- గత టీడీపీ హయాంలో 50 శాతం రోడ్లు పూర్తి
- ఎక్కడికక్కడ పనులు నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- పలు రోడ్లు తవ్వేసి.. సామగ్రి అపహరణతో అస్తవ్యస్తం
- వాటిని పునరుద్ధరించి రోడ్డు నెట్‌వర్కుపై సీఆర్‌డీఏ దృష్టి
- కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కు పూర్తి చేస్తే అమరావతి అభివృద్ధి జెట్ స్పీడ్

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ. రోడ్ల అనుసందానంతో రాజధాని అమరావతి అభివృద్ధిలో దూసుకెళ్తోంది.. అని అందరూ భావించారు. ఆ దిశగా నాటి టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. అమరావతి అన్ని ప్రాంతాలకు అనుసందానం చేస్తూ సీడ్ యాక్సెస్ రోడ్ల నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అమరావతికి శాపమైంది. అమరావతి రాజధాని భవితవ్యం కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కుపై ఆధారపడినా వాటిని ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్లు పాడుబెట్టారు. పైగా అప్పటికే పూర్తి చేసిన రోడ్లను తవ్వేసి ఇసుక, కంకరను తరలించారు. నిర్మాణ సామగ్రిని అపహరించి సొమ్ము చేసుకోవడంపైనే నాటి పాలక పక్షం దృష్టి సారించింది. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టడంతో అమరావతి అభివృద్ధి పట్టాలెక్కింది. ఈ క్రమంలో సీడ్‌యాక్సెస్ రోడ్ల పూర్తి ప్రస్తుతం సీఆర్‌డీఏకు సవాల్‌గా మారింది.

238 కిలోమీటర్ల మేర..

దాదాపుగా 238 కిలోమీటర్ల మేరకు సీడ్ యాక్సెస్ రోడ్డు, మేజర్ ఆర్టీరియల్, ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్ల నిర్మాణం సవాలుగా మారింది. ఇందుకోసం సుమారుగా రూ.9 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నది. ఇప్పటికే వీటి నిర్మాణం ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ప్రారంభ దశలో ఉంటే మరికొన్ని 30 శాతం, రెండు రోడ్లు 50 శాతం పైగా పూర్తి అయ్యాయి. కూటమి ప్రభుత్వం రాబోయే రెండేళ్లలో ఈ రోడ్ నెట్‌వర్కుని పూర్తి చేయగలిగితే అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ గృహాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు వంటివి నిర్మించడానికి పెద్దఎత్తున పెట్టుబడిదారులు తప్పక ముందుకు వస్తారని రాజధాని ప్రజలు భావిస్తున్నారు. రాజధాని నగరంలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ 3 రోడ్డు)గా పరిగణిస్తారు. దీని పొడవు 18.27 కిలోమీటర్లు కాగా ప్రాజెక్టు ఖర్చు రూ.252 కోట్లు. ఇప్పటికే 67.80 శాతం పూర్తి అయింది. ఇది సంపూర్ణం అయితే చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారితో అమరావతి రాజధాని అనుసంధానం పూర్తి అవుతుంది. మరోవైపు చినకాకాని - గుండుగొలను జాతీయ రహదారి నిర్మాణం చివరి దశలో ఉన్నది. ఇది పూర్తి అయితే చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారితో పాటు విజయవాడ - హైదరాబాద్ రోడ్డుకు కనెక్టివిటీ వస్తుంది. దాంతో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరుగుతాయి. రాజధానిలో 1 (రోడ్డు) ఈ08 కాగా దీని పొడవు 14.95 కిలోమీటర్లు. దీనికి రూ.319 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటికే 34.61 శాతం పని పూర్తి అయింది. 2(రోడ్డు) ఎన్9. దీని పొడవు 12.5 కిలోమీటర్లు. రూ. 252 కోట్ల అంచనా విలువతో చేపట్టిన ఈ రోడ్డు పని 50.74 శాతం పూర్తి అయింది. 3వ(రోడ్డు) ఎన్04, ఎన్ 14. దీని పొడవు 15.14 కిలోమీటర్లు కాగా రూ.312 కోట్ల అంచనాతో ఏపీసీఆర్‌డీఏ ప్రారంభించి 35.15 శాతం పూర్తి చేసింది. 4వ(రోడ్డు) ఈ10, ఈ14, ఎన్16 పొడవు 23.94 కిలోమీటర్లు. ఈ రోడ్డుని కూడా 2019కి ముందే అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.395 కోట్ల అంచనాతో ప్రారంభించి 24.70 శాతం పనిని పూర్తి చేసింది. 5వ(రోడ్డు) ఈ6 రోడ్డు పొడవు 9.85 కిలోమీటర్లు కాగా రూ.322 కోట్లతో ప్రారంభించి 10.66 శాతం పూర్తి చేసింది. 6వ రోడ్డు ఈ12 పొడవు 6.791 కిలోమీటర్లు. దీని నిర్మాణాన్ని రూ.265 కోట్లతో ప్రారంభించి 5.79 శాతం మాత్రమే పూర్తి చేయగలిగింది. 7వ రోడ్డు ఎన్ 11 పొడవు 8.657 కిలోమీటర్లు. ఈ రోడ్డు పూర్తి చేయడానికి రూ.327 కోట్ల నిధులు అవసరమౌతాయి. ఇప్పటివరకు 12.88 శాతం పని పూర్తి అయింది. సీరియల్ నెంబరు. 8, 9, 10లను ఈ10, ఈ14, ఎన్ 16, ఈ6, ఈ8, ఈ12, ఎన్ 11లో మౌలిక సదుపాయాల కోసం కేటాయించారు. ప్యాకేజ్ నెంబరు 8 వర్కులకు రూ.550 కోట్లు, 9లో ఉన్న పనులకు రూ.759 కోట్లు, 10లో ఉన్న వాటికి రూ.685 కోట్లు అవసరమౌతాయి. ఈ పనులు కూడా ప్రారంభమై 12 నుంచి 24 శాతం వరకు పూర్తి అయి ఉన్నాయి. 11(రోడ్లు, యుటిలిటీస్) ఈ2, ఈ4, ఎన్7 రోడ్డు పొడవు 32.737 కిలోమటర్లు కాగా రూ. 1,502 కోట్లతో పనులు ప్రారంభించిన ఎల్ అండ్ టీ సంస్థ 21.35 శాతం పూర్తి చేసింది. 12(రోడ్లు, యుటిలిటీస్) ఈ7, ఈ9, ఈ11, ఎన్3ఏ, ఎన్3బీ పొడవు 36.705 కిలోమీటర్లు కాగా రూ. 1429 కోట్లతో మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రారంభించి 24 శాతం పూర్తి చేసింది. 13(రోడ్లు, యుటిలిటీస్) ఎన్ 8, ఎన్10 రోడ్డు పొడవు 30.171 కిలోమీటర్లు కాగా ఎన్‌సీసీ సంస్థ రూ.1436 కోట్లతో చేపట్టి 13.50 శాతం పూర్తి చేసింది. 14(రోడ్లు, యుటిలిటీస్) ఈ16, ఎన్ 12, ఎన్15, ఎన్ 17 పొడవు 28.69 కిలోమీటర్లు కాగా రూ.1,301 కోట్లతో ఎన్‌సీసీ చేపట్టి 15.07 శాతం పూర్తి చేసింది. 15 రోడ్డు ఈ08, డబ్ల్యూఎస్ఐఎస్ పొడవు 13.96 కిలోమీటర్లు కాగా దీనిని కూడా ఎన్‌సీసీ చేపట్టింది. రూ.1,571 కోట్లతో నిర్మాణం ప్రారంభించి 8.77 శాతం పనిని పూర్తి చేసింది. వీటితో పాటు ఎన్ 13, ఈ5 రోడ్లకు మరో రూ.715.74 కోట్ల నిధులు అవసరమౌతాయి.

వైసీపీ హయాంలో విధ్వంసం

అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో కేపిటల్ సిటీ రోడ్డు నెట్‌వర్కు ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల నిర్మాణాలను అప్పటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం చేపట్టి కొంతమేరకు పూర్తి చేసింది. 2019లోనూ టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈపాటికే రోడ్డు నెట్‌వర్కు అంతా పూర్తి అయి ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం రావడంతో ఎక్కడికక్కడ పనులు నిలిపేసి కాంట్రాక్టర్లను తరిమేసింది. దాంతో ఆయా సంస్థలు ఏర్పాటు చేసుకున్న యంత్రాలు, కర్మాగారాలు శిథిలమైపోయాయి. మరోవైపు నిర్మాణం జరిగిన రోడ్లను ఎక్కడికక్కడ వైసీపీ దొంగలు తవ్వేసి తీసుకెళ్లారు. పైపులైన్లు, గ్రావెల్, మెటల్ వంటివి వేటినీ వదిలి పెట్టలేదు. ఇప్పుడు అవన్నీ పునరుద్ధరించి రోడ్డు నెట్‌వర్కు పనులను ప్రారంభించి పూర్తి చేయడమే ఏపీసీఆర్‌డీఏ, ఏడీసీలకు సవాలుగా మారింది. ఈ నెట్‌వర్కుని పూర్తి చేయగలిగితే శరవేగంగా లేఅవుట్లలో నిర్మాణాలు ఊపందుకుంటాయి. దాని వల్ల భవన నిర్మాణ ప్లాన్‌లు, నిర్మాణ సామగ్రి కొనుగోలుకు సంబంధించి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో అమరావతి రాజధానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. సీడ్‌యాక్సెస్ రోడ్లు పూర్తి చేస్తే పెట్టుబడుల కోసం ఎదురు చూడాల్సిన పని ఉండదు. రెసిడెన్షియల్, కమర్షియల్ పరంగా ఎల్లెడలా విస్తరించుకుంటూ అమరావతి అజరామరంగా వెలిగిపోయే అవకాశం ఉంటుంది.



వెస్ట్ బాపట్ల పరిధిలో నిబంధనలు పాటించకుండా వేసిన లే అవుట్

అక్రమ లేఅవుట్లపై ఆరా

- నోటీసులు.. చర్యలపై యంత్రాంగం దృష్టి
- అక్రమాలకు అండగా ఉన్న నేతలపైనా విచారణ

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల దందాపై నూతన ప్రభుత్వం దృష్టి సారించిన సంగతి తెలిసిందే. రియల్టర్ల మాయలో చిక్కుకుని గుల్లవుతున్న సామాన్యుల ఇక్కట్లను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వాటికి సంబంధించిన వివరాలను రాబడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన అక్రమ లే అవుట్లపై యంత్రాంగం దృష్టి సారించింది. వైసీపీ నేతల అండతో జిల్లా పరిధిలోని రియల్టర్లు చెలరేగిపోయారు. గడచిన ప్రభుత్వంలోని అధికారులు అక్రమ లేఅవుట్లను గుర్తించి నోటీసులు జారీ చేశారు. అయితే వైసీపీ నేతల జోక్యంతో అక్రమ లేఅవుట్లపై చర్యలు అంతటితో ఆగిపోయాయి తప్పితే అంగుళం ముందుకు కదలలేదు. పైగా నోటీసులు ఇచ్చింది 2022లో కాగా మళ్లీ ఈ వ్యవధిలో కూడా పదుల సంఖ్యలో లే అవుట్లను నిబంధనలకు విరుద్ధంగా వేసి మధ్య తరగతి వర్గాలను నిలువునా వంచించారు. గతంలో జారీ చేసిన నోటీసులతో పాటు ప్రస్తుతం వేటికి నోటీసులు ఇచ్చి వివరణ కోరాలి అనే అంశాలతో సమగ్ర నివేదికపై యంత్రాంగం దృష్టి సారించింది. దీనికి సంబంధించిన కసరత్తును ఇప్పటికే ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. 2022లో జిల్లా వ్యాప్తంగా 241 లే అవుట్లు నిబంధనల ప్రకారం లేవని గుర్తించి వాటి యజమానులకు నోటీసులను యంత్రాంగం అందించింది. ఒక్క బాపట్లలోనే 61 ఉన్నట్లు గుర్తించగా వీటిలో దాదాపు 50కి కనీస స్థాయిలో కూడా అనుమతులు లేవనే అంశం అప్పట్లో బహిర్గతమైంది. వీటి యజమానులంతా వైసీపీ నేతల అనుచరగణమే కావడంతో నోటీసులను చెత్తబుట్టల్లోకి వెళ్లాయి. లే అవుట్లలో పెట్టిన ఫ్లెక్సీలను సైతం పీకిపారేసి అధికార జులుం ప్రదర్శించారు. అప్పుడు జారీ చేసిన నోటీసులకు వివరణ ఇవ్వక పోగా మళ్లీ ఆ యజమానులే ఈ రెండేళ్ల వ్యవధిలో ఇంకో 70 వరకు అక్రమ లే అవుట్లను వేశారనేది సమాచారం.

జరిమానాలు వేయడమా.. బ్లాక్ చేయడమా..

అధికార పార్టీ అండ ఉందనే ధీమాతో ప్రభుత్వం జారీ చేసిన నోటీసులపైనే లెక్కలేని తనంగా వ్యవహరించిన రియల్టర్లపై ఏం చర్యలు తీసుకోనున్నారో అనేది చూడాల్సి ఉంది. 2022లో జిల్లాలో 241 లే అవుట్లకు జారీ చేసిన నోటీసులలో ఏ ఒక్కదానికి కూడా సంతృప్తికర వివరణ యంత్రాంగానికి అందలేదు. నిబంధనల ప్రకారం రెండో దఫా నోటీసులు కూడా అప్పట్లో జారీ చేశారు. అయినా స్పందనలేదు. ఒకరిద్దరు రియల్టర్లు అయితే అధికారులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ దందాలో బాపట్ల మాజీ ఎమ్మెల్యే పీఏ కీలకంగా వ్యవహరించారనే ప్రచారం అప్పట్లో నడిచింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ లే అవుట్ల దందాపై దృష్టి పెట్టినందు వల్ల అప్పుడు జారీ చేసిన నోటీసుల సంగతేంటి అన్న అంశంతో పాటు, పీఏ పాత్ర వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు. రెండుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించని వారికి భారీగా జరిమానా విధించడమో లేక వాటి అనుమతులు రద్దు చేసి బ్లాక్‌లిస్టులో పెట్టడమో చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే లే అవుట్లలో దాదాపు 60 శాతం ప్లాట్లు వినియోగదారులకు అమ్మకాలు జరిపి కోట్లు గడించారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వారి ప్రయోజనాలకు భంగం కలగకుండా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బాపట్ల జేసీగా బి.సుబ్బారావు

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బి.సుబ్బారావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలిచ్చింది. 2017 బ్యాచ్‌కు చెందిన సుబ్బారావు ప్రస్తుతం జగనన్న అర్బన్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకానికి ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ జేసీగా పనిచేసిన చామకూరి శ్రీధర్ ఉద్యోగోన్నతిపై అన్నమయ్య జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో సుబ్బారావును జేసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వారం క్రితం జరిగిన బదిలీల్లో జిల్లాకు వెంకటమురళిని నూతన కలెక్టర్‌గా నియమించిన ప్రభుత్వం, తాజా ఉత్తర్వుల్లో జేసీగా సుబ్బా రావుకు అవకాశమిచ్చింది. అటు కలెక్టర్‌గా వెంకటమురళికి, ఇటు జేసీగా సుబ్బారావుకు తొలిపోస్టింగ్ కావడం గమనార్హం.

దిక్సూచి DIKSUCHI

ఐఎస్‌బీలో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)- మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌లు వీటిని అందిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 28**
- **వెబ్‌సైట్:** isb.edu

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు

పీజీపీ ఇన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానంగా పరిగణిస్తారు. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కూడా ఉంటుంది.
అర్హత: ఏదేని డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15
పీజీపీఎంఏఎక్స్: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. దీనిని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు, బిజినెస్ ఓనర్స్‌కు ఉద్దేశించారు. ఇది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. ప్రోగ్రామ్ మొత్తానికి 24 క్రెడిట్లు నిర్దేశించారు.
అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 1
పీజీపీప్రో: ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. ముంబై, బెంగళూరు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇది వీకెండ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సమానం. ఫైనాన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 18
పీజీపీఎంఎఫ్‌ఏబీ: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది మాడ్యులర్ ప్రోగ్రామ్. దీనిని కుటుంబ పరంగా సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారికి ఉద్దేశించారు. ఇందులో బిజినెస్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ మెథడాలజీ, టూల్స్ అండ్ టెక్నిక్స్, లీడర్‌షిప్ టెక్నిక్స్ నేర్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం తప్పనిసరి కానప్పటికీ కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.15,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మొదటి రౌండ్‌కు నవంబరు 10; రెండో రౌండ్‌కు 2025 మార్చి 9

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)

ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు పూర్తిచేయాల్సి ఉంటుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్ సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/ఎన్‌మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు.

'సర్దార్ పటేల్' టెక్స్‌టైల్ స్కూల్లో డిగ్రీ, ఎంబీఏ

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, కోయంబత్తూరులో నిర్వహిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌వీపీఐటీఎం)-డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(ఎస్‌వీపీఈటీ)/సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఇతర మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌లను కూడా అనుమతిస్తారు.
డిగ్రీ ప్రోగ్రామ్‌లు: మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ (టెక్స్‌టైల్స్/టెక్నికల్ టెక్స్‌టైల్స్), బీబీఏ టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో మూడేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్) డిగ్రీతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.
ఎంబీఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
ఎస్‌వీపీ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట.
షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: మెడికల్ టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, నాన్ వోవెన్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మొదటి రెండు ప్రోగ్రామ్‌ల వ్యవధి 30 గంటలు. చివరి ప్రోగ్రామ్ వ్యవధి 15 గంటలు. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.svpitm.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/SCMrlySలో చదవండి.

SCHOLARSHIP ALERT

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Description: An initiative of Aadhar Housing Finance Limited(AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5-3 lakh are eligible to apply.
Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000 *Last Date:* 23-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AKSP1

Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers(LMV/HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.
Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Aru nachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/ HMV), mechanics and children from the Economi cally Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.
Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support
Last Date to Apply: 03-09-2024
Application mode: Online Application only
Short Url: www.b4s.in/aj/MKSP1

IDFC FIRST Bank MBA Scholarship

Description: IDFC FIRST Bank MBA Scholarship is a need-based scholarship program run by IDFC FIRST Bank to financially support students with a family income of less than INR 6 lakh per annum. The purpose of this scholarship is to make post-graduate studies in business management accessible to meritorious students who are unable to pursue higher studies due to financial constraints.
Eligibility: Indian students enrolled in the first year of a 2-year full-time MBA program for the class of 2024 at selected educational institutions may apply for this scholarship. Applicants' gross annual family income should be less than or equal to INR 6 lakh. Applicants must have a valid mobile number linked to their Aadhaar number.
Prizes & Rewards: INR 2 lakh for 2 years of MBA studies (INR 1 lakh/year)
Last Date to Apply: 31-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/IFBMS5


buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

వెబ్ సిరీస్‌లో త్రిష



హీరోయిన్ త్రిష తొలిసారిగా ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు. అనూహ్యమైన మలుపులతో, ఉత్కంఠభరితంగా సాగే ఆ సిరీస్ పేరు 'బృంద'. సోనీ లివ్‌లో ఆగస్టు 2న ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, మరాఠి, బెంగాలీ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుండడం విశేషం. ఈ సిరీస్ గురించి దర్శకుడు సూర్య మనోజ్ వంగాల మాట్లాడుతూ 'ఆద్యంతం సస్పెన్స్‌తో 'బృంద' సిరీస్ సాగుతుంది. శక్తిమంతమైన ఫీమేల్ లీడ్ నేరేటివ్ స్టోరీ ఇది. దీన్ని చూశాక ఇప్పటిదాకా నమ్ముతున్న నమ్మకాల మీద ఫోకస్ పెరుగుతుంది. ఈ జోనర్‌లో వచ్చే సినిమాలకు కొత్త నిర్వచనం చెప్పేలా ఉంటుంది' అన్నారు. సూర్య మనోజ్ వంగాల, పద్మావతి మల్లాది కలసి రూపొందించిన స్ర్కీన్‌ప్లే సిరీస్‌కు హైలైట్ అవుతుందని అంటున్నారు. డ్రామా, క్రైమ్, మిస్టరీ అంశాలతో రూపొందిన ఈ సిరీస్‌కు శక్తికాంత్ కార్తిక్ సంగీతం అందించారు. దినేష్ కె బాబు ఛాయాగ్రాహకుడు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్ర విజయ్, ఆనంద్ సామి, రాకేందు మౌళి తదితరులు నటించారుజ



కేస్ నంబర్ 15 ఏమిటి?

అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియ సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నం.15'. తడకల వంకర్‌రాజేశ్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'కేస్ నం.15' ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్‌రాజేశ్ మాట్లాడుతూ "సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. సినిమాను ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించాం. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు వస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కె.స్వామి, సినిమాటోగ్రఫీ: ఆనమ్ వెంకట్, సంగీతం: జాన్.

భారతీయుడు-2 బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు





భారతీయుడు-2 సినిమా బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా నటుడు కమల్‌హాసన్‌తో పాటు చిత్ర బృందం శంకర్, సిద్ధార్థ, సముద్రఖని కలిసి డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా అవగాహన వీడియో రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కాగా గత వారం కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు కొత్త వాహనాలు ప్రారంభించిన సమయంలో డ్రగ్స్ నిర్మూలనకు సినీ పరిశ్రమ తమ వంతు సహకారం అందించాలని సీఎం సూచించారు. ప్రతి సినిమా విడుదల సమయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నటీనటులు కనీసం రెండు నిమిషాల నిడివితో వీడియో చిత్రీకరించి ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు సినీ ప్రముఖులు, క్రీడా కారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.

నా మాటల్ని అపార్థం చేసుకున్నారు

'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తను మాట్లాడిన మాటల్ని అపార్థం చేసుకున్నారని సిద్ధార్థ్ చెప్పారు. డ్రగ్స్ కట్టడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తాను. సీఎం సార్.. మేం ఎప్పుడూ మీతోనే" అంటూ ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో ఆయన పేర్కొన్నారు.

దర్శకుడే హీరో!

కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా లభిస్తున్న ప్రస్తుత తరుణంలో దర్శకనిర్మాతలు ఇప్పుడు విభిన్న కథాంశాలను ఎన్నుకుంటూ చిత్రాలు నిర్మిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'కళింగ'. ఇంతకుముందు 'కిరోసిన్' చిత్రంలో నటించిన ధ్రువ వాయు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కూడా ఆయనే. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సీనియర్ రైటర్ విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టర్‌లో హీరో, అతని వెనుక ఉగ్ర రూపంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, హీరో చేతిలో కాగడ.. ఇవన్నీ సినిమా మీద ఆసక్తి పెంచుతున్నాయి. ప్రగ్యా నయన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'ఆడుకాలం' నరేన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, తనికెళ్ల భరణి, సమ్మెట గాంధీ, బలగం సుధాకర్, సంజయ్‌కృష్ణ, హరిశ్చంద్ర తదితరులు ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్.



వినోదాత్మకంగా పేకమేడలు



'నా పేరు శివ', 'అంధగారం' 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న వినోద్‌కిషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పేకమేడలు'. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో 'ఎవరికీ చెప్పొద్దు' సినిమా ఫేమ్ రాకేశ్ వర్రే సినిమాను నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు లాంచ్ చేసి.. ఇప్పటికే పలు రకాల విభిన్న ప్రమోషన్ కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకుంది చిత్రబృందం. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "సామాన్యుల జీవితాల్లో జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమా కథను రాసుకున్నాను. వినోదంతో పాటు భావోద్వేగాలను మిళితం చేసిన సినిమా ఇది" అని అన్నారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ "ఇది కేవలం ఒక వినోదాత్మక చిత్రమే కాదు.. ఒక భార్య తన భర్తకు అన్ని వేళలా ఎంతగా సపోర్ట్ చేస్తుందో చూపించే చిత్రం" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని హీరో వినోద్‌కిషన్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

నాగులాపురం నాగమ్మ



మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడికల్ డ్రామా 'ఆది పర్వం'. శివకంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎమ్.ఎస్.కె.రచన నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా సాంగ్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "ఈ సినిమాలో మంచు లక్ష్మీ 'నాగులాపురం నాగమ్మ'గా నటిస్తున్నారు. ఆ పాత్రలో ఆమె నట విశ్వరూపం చూస్తారు. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాకే హైలైట్" అని చెప్పారు. "ఆదిపర్వం' మీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అని మంచు లక్ష్మీ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పవన్ శేఖర్ పసుపులేటి, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎన్.హరీశ్, సంగీతం: మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి.సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్.

ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో ఆరంగేట్రం చేసి.. వరుస సినిమాల్లో నటించారు నభా నటేశ్. కానీ 2021లో వచ్చిన 'మాస్ట్రో' సినిమా తర్వాత తెరపై కనిపించలేదు. ఈ విరామానికి కారణాన్ని ఆమె లేటెస్ట్‌గా నటించిన 'డార్లింగ్' సినిమా ట్రైలర్ లాంచ్‌లో తెలిపారు. "2022లో నాకు యాక్సిడెంట్ అయ్యింది. ఆ సమయంలో నా చేతిలో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నందున.. వాటిని పూర్తి చేసేందుకు సర్జరీ చేసుకుని తగినంత విరామం లేకుండా సెట్స్‌లో అడుగుపెట్టాను.. దాంతో ఆ గాయం తిరగబెట్టింది. అందుకే ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇప్పటివరకూ నేను గ్లామరస్ పాత్రలే ఎక్కువ పోషించాను. ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది. ఇప్పటి నుంచి నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లోనూ నటించాలనుకుంటున్నాను. అందుకే స్ర్కిప్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను" అని చెప్పారు. నభా నటించిన 'డార్లింగ్' చిత్రం ఈ నెల 19న విడుదల కానుండగా, ఆమె నటిస్తున్న 'స్వయంభు' చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/sLtj82Y
లో చదవండి.

గుండెపోటుతో ఉషా ఉతప్ భర్త కన్నుమూత



ప్రముఖ గాయని ఉషా ఉతప్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త జానీ చాకో ఉతప్ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 78 ఏళ్లు. కోల్‌కతాలోని వారి ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో ఆయనకు గుండె పోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు తప్పనిసరి

● గుంటూరు రేంజి డీఐజీ త్రిపాఠి



సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న రేంజ్ డీఐజీ త్రిపాఠి

తాడేపల్లి టౌన్, జూలై 9: సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని గుంటూరు రేంజి డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లి పరిధిలో పలు ప్రాంతాలను డీఎస్పీ రవికాంత్, సీఐ కళ్యాణ్‌రాజు సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కృష్ణానది తీరం వెంబడి ఉన్న సీతానగరం, ప్రకాశం బ్యారేజి, మహానాడు తదితర ప్రాంతాల్లో ఎక్కడ ఎక్కడెక్కడ సీసీ కెమేరాలు ఉన్నాయో వాటి పనితీరు అడిగి తెలుసుకున్నారు. అలాగే మరికొన్నిచోట్ల నూతనంగా సీసీ కెమేరాలు స్థానికుల సమన్వయంతో ఏర్పాటుచేయాలని సూచించారు. సీఎం, మంత్రులు సహా వీవీఐపీలు తిరిగే మార్గాలుకావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో అలసత్వం వహించరాదని ఆదేశించారు. చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించడం తగదని హెచ్చరించారు. కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఒకరికి గాయాలు



సుబ్బారావు మృతదేహం

తుళ్లూరు, జూలై 9: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం లింగాయపాలెం పరిధిలోని సీడ్‌యాక్సెస్ రోడ్డులో జరిగింది. జంక్షన్ దాటిన తరువాత కుక్క అడ్డురావటంతో ఇద్దరు ప్రయాణిస్తున్న బైకు అదుపుతప్పింది. వెనకకూర్చొని ఉన్న నర్సపురం వెంకటసుబ్బారావు(27) వెనకకుపడిపోయి తల డివైడర్‌కు బలంగా తగిలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళగిరి హాస్పటల్‌కు తరలించారు. బైకు నడుపుతున్న ధనసిరి మురళికి చిన్న గాయమైంది. చికిత్సకోసం హాస్పటల్‌కు తరలించారు. మృతుడు వెంకటసుబ్బారావు తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామావాసి. అతనికి భార్య, నాలుగు సంవత్సరాల కూమార్తె ఉన్నారు. గాయపడ్డ మురళి, మృతిచెందిన వెంకటసుబ్బారావు కరెంటు పనిచేస్తూ ఉంటారని బంధువులు తెలిపారు. రోజూ విజయవాడ పరిసర ప్రాంతాలకు వెళ్ళి పనులుచేసుకుని సాయంత్రం ఇంటికి వస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఇరువురు నెక్కల్లు నుంచి బైకుపై బయలుదేరి ఈ దుర్ఘటనకు గురయ్యారని తెలిపారు. తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతుల వెల్లువ

● 14వ రోజు లోకేశ్ ప్రజాదర్బార్
● నూతన ఒరవడి సృష్టిస్తున్న ఐటీ శాఖ మంత్రి
● యువనేత ఆత్మీయ పలకరింపు.. అర్జీదారుల్లో ఆనందం



అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, జూలై 9: వివిధ ప్రాంతాల నుంచి సమస్యల వినుతులతో బాధితులు తరలివస్తూనే ఉన్నారు.. ఆత్మీయ పలకరింపుతో వారి నుంచి అర్జీలు స్వీకరిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నూతన ఒరవడి సృష్టిస్తున్నారు. లోకేశ్ ఉండవల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ మంగళవారంతో 14వ రోజుకు చేరుకుంది. మంగళగిరితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు యువనేతను నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. విజ్ఞప్తులు స్వీకరిస్తూ పెద్దలను నమస్కారం తాతయ్య.. నమస్కారం అమ్మా అంటూ పిలుస్తున్న లోకేశ్ ఆత్మీయ పలకరింపునకు ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయనే భరోసా, నమ్మకంతో అర్జీలు అందించి లోకేశ్‌ను ఆశీర్వదిస్తూ వెళుతున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురి చేశారు. కానీ నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరని నేరుగా కలిసి విజ్ఞప్తులు స్వీకరించడంతోపాటు ఆయా సమస్యల పరిష్కారానికి లోకేశ్ సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది ఆయాలు, పారిశుధ్య కార్మికులను గత ప్రభుత్వం అర్థాంతరంగా తొలగించిందని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన ఏపీజీసీఎస్ యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తొమ్మిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని పాఠశాలల విలీనంతో పని ఒత్తిడి పెరిగిందని తెలిపారు. కనీస వేతనం అమలు చేయడంతోపాటు అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని విధుల్లో తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు కోరారు.

బాధితులు బారులు

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీతం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కేసీ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌ను కోరారు. పక్షవాతంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని మెల్లెంపూడికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన సతీమణి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని మంగళగిరి ఉడా కాలనీకి చెందిన షేక్ మౌలాలి కోరారు. తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాతోపాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆత్మకూరులోని సీతారామ అపార్టుమెంట్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై న్యాయవిచారణ జరిపించి తక్షణమే వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని విశాఖకు చెందిన ఏపీబీసీ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా నాగులాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తున్న తనను గత ప్రభుత్వం అకారణంగా తొలగించిందని తిరిగి ఉద్యోగం కల్పించాలని ఎన్ మహేశ్వరి కోరారు. శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న తనకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డీసీ ఉన్నూరు సాహెబ్ కోరారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణతోపాటు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించాలని అర్హత పత్రాలు మంజూరు చేయాలని, ఆర్ఎంపీ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ ప్రతినిధులు కోరారు.

వైసీపీ నేతల భూ అక్రమాలపై సిట్ ఏర్పాటుచేయాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, జూలై 9: వైసీపీ నేతల భూ అక్రమాల పై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటుచేస్తే మేలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు నుంచి ఉత్తరాంధ్ర వరకు వైసీపీ గద్దలు చెరబట్టిన భూములను విడిపించాలన్నా, సత్వర న్యాయం జరగాలన్నా ఇదే మేలన్నారు. మరీ ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నుంచి అతని కోటరి విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలే కాక నాటి సీఎస్ జవహర్‌రెడ్డి పైనా తీవ్రమైన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్‌కు అప్పగించటమే ఉత్తమమన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో ఒక్క విశాఖ ఉత్తరాంధ్రలోనే 40వేల ఎకరాలకు పైగా భూ ఆక్రమణలు జరిగినట్టు ఫిర్యాదులు ఉన్నాయని, అవన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా వైసీపీ నేతలతోనే ముడిపడి ఉన్నాయన్నారు. మరీ ముఖ్యంగా పేదలకు ఏదో మేలు చేస్తున్నట్టు నటించి అసైన్డ్ భూముల శాశ్వతహక్కుల పేరుతో వారి జీవనాధారంగా ఉన్న పొలాలు లాక్కున్న దుర్మార్గపు పాలన నాడు రాష్ట్రమంతా చూసిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో విడుదల చేయనున్న శ్వేతపత్రంలో ఈ భూదోపిడీ మొత్తాన్ని ప్రజల ముందుకు తీసుకువస్తామన్నారు. అదేవిధంగా భూముల రీసర్వే చట్టంలో లొసుగులతో ఎన్ని భూములు కొట్టేశారో కూడా నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. నాటి ప్రభుత్వంలో ఉన్న పెద్దలే బినామీలను అడ్డం పెట్టుకొని విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కాజేశారని, తమ అనుయాయులకు, తమకు కావాల్సిన కంపెనీలకు నాటి సీఎం జగన్ అడ్డదారుల్లో వేలాది ఎకరాలు కట్టబెట్టేసిన తీరుపై నిజాలు వెల్లడి కావాలని ప్రత్తిపాటి కోరారు. ఇవేకాక జగనన్న కాలనీల పేరిట పేదల ఇళ్ళస్థలాల పథకంలో భారీగా దోచేశారని, భూములు చేతులు మారాయన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవ్వరూ చేయని రీతిలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని, వైసీపీ ఐదేళ్ల భూఆక్రమాలపై కఠినచర్యలతో పాటు ఈ ఆస్తుల మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

మన్నవలో రికార్డుల తారుమారుపై విచారణ

● నెల రోజులుగా సర్పంచ్ కనిపించటం లేదంటూ ఫిర్యాదు ● రికార్డుల అదృశ్యంపై ఆగ్రహం



మన్నవ పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

పొన్నూరుటౌన్, జూలై 9: పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో రికార్డుల తారుమారు, సర్పంచ్ అందుబాటులో లేకపోవటంపై మంగళవారం డీఎల్‌పీవో స్వరూపరాణి విచారణ నిర్వహించారు. ఇటీవల గ్రామస్థులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు నెల నుంచి గ్రామంలో అందుబాటులో లేరని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంచి నీరు అందక శానిటేషన్ సక్రమంగా చేయకపోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన సచివాలయంలో గ్రామసభ నిర్వహించినా సర్పంచ్ ఆ రోజు కూడా అందుబాటులో లేరని చెప్పారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ కూడా గ్రామసభకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో ఉండాల్సిన రికార్డులు, అకౌంట్ పుస్తకాలు, సమావేశ తీర్మానాలు, గ్రామసభ పుస్తకాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలు, చెక్ బుక్కుల వంటి రికార్డులను గ్రామ కార్యదర్శి ఆధీనంలో ఉండాల్సివుండగా సర్పంచ్ నాగమల్లేశ్వరరావు రికార్డులు తీసుకువెళ్లారని పంచాయతీ అధికారులు చెబుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రికార్డులన్నీ బిల్ కలెక్టర్ వాకా శ్రీనివాసరావు సర్పంచ్‌కు అందచేశారని ఆరోపించారు. పంచాయతీ నిధులు అన్నింటిని దొంగ బిల్లులతో దారి మళ్లించి అవినీతికి పాల్పడుతున్నారని తాము ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. వీటన్నింటిపై మంగళవారం డీఎల్‌పీవో పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. కార్యదర్శి రవిబాబు అనారోగ్యంతో బాధపడుతుంటంతో బిల్ కలెక్టర్ వద్ద రికార్డులు అన్నీ భద్రపరిచినట్లు సమాధానం ఇవ్వటంతో బిల్ కలెక్టర్‌ను ప్రశ్నించారు. బిల్‌కలెక్టర్ శ్రీనివాసరావు పొంతన లేని సమాధానాలు ఇవ్వటంతో డీఎల్‌పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మూడు రోజుల లోగా రికార్డులు అందచేయాలని ఆదేశించారు. విచారణ జరుగుతుండగానే ఓ వ్యక్తి కొన్ని రికార్డులను సర్పంచ్ నాగమల్లేశ్వరరావు పంపాడని కార్యాలయంలోకి తీసుకురాగా డీఎల్‌పీవో వీడియో రికార్డింగ్ చేయించారు. పంచాయతీలో ఉండాల్సిన రికార్డులు బయటకు తరలించటంపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అలాగే నెలరోజులకు పైగా సర్పంచ్ గ్రామ ప్రజలకు అందుబాటులో లేకుండాపోవటంపై కూడా నివేదిక రూపొందించనున్నట్లు చెప్పారు.

లింగాయపాలెం-తాళ్ళాయపాలెం
ఇసుక స్టాక్‌యార్డును పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



స్టాక్‌యార్డు వద్ద తహసీల్దార్ సుధీర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మీ పక్కన ఎస్పీ తూషార్ రూఢీ

తుళ్లూరు, జూలై 9: మండలంలోని లింగయపాలెం, తాళ్ళయపాలెంలో ఇసుక స్టాక్‌యార్డులలో లోడింగ్ పనులను కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ తుషార్‌రూఢీ మంగళవారం పరిశీలించారు. ఇసుక లోడింగ్ విషయంలో యంత్రాలతోపాటు, ట్రాక్టర్‌లకు లోడు చేసేందుకు కూలీలకు పనికల్పించాలని గ్రామస్తులు వారికి విన్నవించారు. రాజధానికి భూములివ్వటంతో ఉపాధిలేక కూలీలు అల్లాడుతున్నారని విన్నవించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇసుకపాలసీ తెచ్చి లోడింగ్ పనులు మొదలయ్యాయని, రెండుమూడు నెలల్లో కొత్త పాలసీ వస్తుందని, తప్పకుండా వారికి అవకాశం ఉండేలా ప్రభుత్వానికి చెపుతామని కలెక్టర్ హామీనిచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడారు. రెండు స్టాక్‌యార్డుల్లో దాదాపు 6లక్షల టన్నుల ఇసుక నిల్వవున్నట్టు చెప్పారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో కమిటీ ఇసుక లోడింగ్ పనులు పారదర్శకంగా నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఏవో శ్రీఖర్, పోలీసు, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.

12న పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య), జూలై 9: ఈనెల 12న భవిష్యనిధి పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్‌దారులు తమ సమస్యలను ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి పెన్షన్ కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. సమస్యలను ro.guntur@ epfindia.gov.in మెయిల్‌కు లేదా 949 46557469 అనే వాట్సప్‌నంబర్‌కు, వెబ్‌ఎక్స్ ఐడీ 26441709396, పాస్‌వర్డ్ epfo@1234 ద్వారా తెలపాలని సూచించారు.

సూర్యలంక తీరంలో దుకాణాల మూత

● కొనసాగుతున్న పర్యాటకుల నిషేధం ● నిర్మానుష్యంగా సముద్రతీరం ● చిరువ్యాపారులపై తీవ్ర ప్రభావం



పర్యాటకుల రాకపోకలను నిషేధించటంతో నిర్మానుష్యంగా ఉన్న సూర్యలంక సముద్రతీరం



సూర్యలంక సముద్రతీరంలో మూతపడిన దుకాణాలు

బాపట్ల, జూలై 9: నిత్యం పర్యాటకులు, భక్తుల రాకపోకలతో రద్దీగా ఉండే సూర్యలంక సముద్రతీరం గత నెల 24వ తేదీ నుంచి వెలవెలబోతున్నది. తీరంలో వరుస ప్రమాదాల దృష్ట్యా పోలీసు అధికారులు తీరానికి పర్యాటకుల అనుమతిని నిలిపివేశారు. జిల్లాలోని వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో వరుసగా పర్యాటకులు గల్లంతై మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు సముద్రతీరానికి పర్యాటకులను రావద్దని ప్రకటించారు. దీంతో అప్పటినుంచి తీరంలో జనసంచారం లేదు. పోలీసులు, మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తూ పర్యాటకులను రాకుండా అడ్డుకుంటున్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలో చిరువ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. తీరంలో దుకాణాలు ఏర్పాటుచేసుకొని పర్యాటకుల నుంచి వచ్చే ఆదాయంతో జీవనం సాగించే కుటుంబాలు ఆదాయం లేక అల్లాడిపోతున్నారు. సూర్యలంక సముద్రతీరంలో 39 దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో పర్యాటకులు, భక్తులకు అవసరమైన వివిధ రకాల వ్యాపారాలు జరుగుతుంటాయి. అదేవిధంగా ఫిష్ ఆంధ్ర దుకాణాలు 10, ఐస్‌క్రీమ్ బండ్లు 50, చేపలు విక్రయదుకాణాలు 10, బోర్డింగ్‌పాయింట్‌లు 5, రైడింగ్ బైక్‌లు, గుర్రం స్వారీ, ఒంటెలు ఏర్పాటుచేసుకొని జీవనం సాగించే కుటుంబాలు ఉన్నాయి. తీరానికి వచ్చే పర్యాటకులే తమకు జీవనాధారమని వారు పేర్కొంటున్నారు. అయితే సముద్ర ఆటుపోటుల వల్ల ఏర్పడిన గుంతలతో ప్రమాదం పొంచివుందనే భయంతో అధికారులు తీరానికి పర్యాటకులను అనుమతించడంలేదు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచి తెలియక వచ్చే పర్యాటకులు వెనక్కి వెళ్ళిపోతున్నారు. దీని వల్ల దుకాణాలు మొత్తం మూతపడి సూర్యలంక తీరం నిర్మానుష్యంగా మారింది. ఇంకా 10 రోజులపాటు తీరానికి అనుమతిలేదని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో చిరువ్యాపారులు, రోజువారి కూలీలు అల్లాడిపోతున్నారు. పోలీసులు మాత్రం పర్యాటకుల శ్రేయస్సే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటిస్తున్నారు. ఈ విషయమై డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణను వివరణ కోరగా పర్యాటకులకు అనుమతి ఇచ్చే విషయమై ఎస్పీ వకుల్‌జిందాల్‌తో మాట్లాడి ప్రకటిస్తామని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

రూ.55.6 లక్షల విలువైన బయోల అమ్మకాలు నిలిపివేత



పురుగుమందుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

గుంటూరు సిటీ, జూలై 9: రాష్ట్రస్థాయి తనిఖీ బృందాలు జిల్లా లోని వ్యవసాయ ఆధారిత కంపెనీలు, షాపులపై మంగళవారం దాడులు నిర్వహించాయి. గుంటూరు అర్బన్, ప్రత్తిపాడు, తెనాలి, మేడికొండూరు, మంగళగిరి మండలాల్లో తనిఖీలు కొనసాగినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో స్టాక్ రిజిస్టర్లు పరిశీలించటంతో పాటు, నిల్వలను అధికారులు పరిశీలించారని తెలిపారు. నిబంధనలు సక్రమంగా పాటించని రూ.55.6 లక్షల విలువైన బయో ఉత్పత్తులు, ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని వెల్లడించారు. ఈ దాడుల్లో ఏడీఏలు కే నాగేశ్వరరావు, బాలాజీనాయక్, విజిలెన్స్ సీఐలు ఎస్ శ్రీనివాసరెడ్డి, సీ మాణిక్యరావు, వ్యవసాయ అధికారి బీ గౌతమ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

33,152 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 34,722 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 33,152 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 15,887 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8500	15500
నెంబరు. 5	8000	15000	నెంబరు.5	–	–
273	11000	15000	273	13500	13500
341	8500	16000	341	12500	13300
4884	–	–	4884	13000	15500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	19000	తేజ	10000	18500
బ్యాడిగి	8500	16500	బ్యాడిగి	11000	14000
దేవనూరుడీలక్స్	9000	15500	దేవనూరుడీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	12500	తెల్లకాయలు	6000	11500

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి



ఉప్పుతోళ్ల తిరుపతయ్య మృతదేహం

దాచేపల్లి, జూలై 9: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికూడి సమీపంలో వైసీపీ నేత నిర్వహిస్తున్న మైనింగ్ క్వారీలో పడి యువకుడు మంగళవారం మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి మృతుని బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతయ్య (20) కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసయ్యాడు. దీంతో పలుమార్లు తండ్రి మందలించడం జరిగింది. గతంలో ఒకటి రెండుసార్లు మృతుడు తిరుపతయ్య ఆత్మహత్యకు యత్నించినట్లు కూడా తెలుస్తుంది. తన మొబైల్ ఫోన్ క్వారీ గుంత ఒడ్డున పెట్టి గుంతలో దూకి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ

● 136 గ్రాముల బంగారం, అరకిలో వెండి అపహరణ

మంగళగిరి సిటీ, జూలై 9: మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో చోరీ జరిగింది. పెద్ద మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రబాలెం శ్రీనగర్ కాలనీకి చెందిన లంకె సురేష్ హార్టికల్చర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. బంధువు చనిపోవడంతో కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 6వ తేదీన అనంతపురం వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగులగొట్టబడి వున్నాయి. చోరీ జరిగిందని గ్రహించి మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో సుమారు 136 గ్రాముల బంగారు ఆభరణాలు, అరకిలో వెండి వస్తువులు, రూ.30వేల నగదు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సురేష్ ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత ఇసుక అన్యాక్రాంతం కాకుండా నిఘా పెట్టాలి

● రవాణాశాఖాధికారులకు సూచించిన ఎంపీ తెన్నేటి



బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కలిసి మొక్క అందజేస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి సురేష్

బాపట్ల, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం పగడ్బందీగా అందిస్తున్న ఉచిత ఇసుక అన్యాక్రాంతం కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా రవాణా శాఖాధికారి సురేష్‌కు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సూచించారు. ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా రవాణాశాఖాధికారి సురేష్ మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం జీవో ప్రకారం ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకను తీసుకెళ్ళటానికి అనుమతి ఉందని చెప్పారు. దీనిపై రవాణాశాఖాధికారులు నిఘా ఉంచాలని ఎంపీ సూచించారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది వివరాలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు ఆనందం కలిగించిన ఇసుక విధానం

● టీడీపీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ

బాపట్ల, జూలై 9 : కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఇసుక పాలసీ ప్రజలకు ఆనందం కలిగించిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ అన్నారు. ఇసుకమాఫియాకు కళ్లెం వేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడి యదేచ్ఛగా జరిపి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారన్నారు. ప్రజల ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక హామీ అమలు చేసి నిర్మాణ రంగాన్ని బలోపేతం చేశారన్నారు. బాపట్లలో ఉచిత ఇసుకను ప్రారంభించిన ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ఇసుక విధానం హర్షణీయం

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్

బాపట్ల, జూలై 9 : ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ ప్రకారం ఇసుక సరఫరా విధానాన్ని సరళీకరించి తక్కువ ధరకు ప్రజలకు అందించటం హర్షణీయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్ అన్నారు. ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసి ఇంతకాలం జరిగిన అక్రమ దోపిడికి చరమగీతం పాడి ప్రజలపై ఇంతకాలం ఉన్న మోయలేని భారాన్ని తగ్గించి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవటం సంతోషదాయకమన్నారు. మార్కెట్ యార్డు వద్ద ఇసుక కోసం వాహనాలు రోడ్డుపై బారులు తీరి ఉండటం ప్రమాదకరం కావున అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

బాపట్ల జిల్లా పోలీసు శాఖకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు



మల్లికార్జునరావుకు అవార్డు అందజేసి అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జూలై 9 : బాపట్ల జిల్లా పోలీసు శాఖకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం వారు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించారు. అవార్డును మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి.మల్లికార్జునరావుకు అందజేసి అభినందించారు. అవార్డు రావటం గర్వకారణమన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే ఇలాంటి అవార్డులు వరిస్తాయని ఎస్పీ అన్నారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ప్రతి సంవత్సరం పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విభాగంలో ప్రజలకు వేగవంతంగా, అత్యుత్తమ, నాణ్యమైన సేవలందించినందుకు ఈ అవార్డును ఇస్తారన్నారు. ఈ సంవత్సరం జిల్లాలోని ఎస్‌బి విభాగం పాస్‌పోర్టల విచారణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు విజయవాడ ప్రాంతీయపాస్‌పోర్ట్ కార్యాలయం వారు బాపట్ల జిల్లాపోలీసు శాఖకు ఈ అవార్డును అందించటం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా ఎస్‌బి యంత్రాంగానికి క్రమపద్ధతిలో తగిన ఉత్తర్వులు ఇస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వహించగలిగేవిధంగా తయారు చేయటం జిల్లా ఎస్‌బి అధికారి మల్లిఖార్జున్ పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు.

బాపట్లలో అంబేద్కర్ గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

● ఎంపీ కృష్ణప్రసాద్‌ను కోరిన దళిత సంఘాల నాయకులు

బాపట్ల, జూలై 9 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరిట బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని దళిత సంఘాల నాయకులు మంగళవారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీని ఘనంగా సత్కరించి సన్మానించిన అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు తదితరులు ఎంపీ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్ళారు. జిల్లాలో దళితులు నివాసం ఉండే ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ సిబ్బంది దళితవాడలలో కనీసం పారిశుధ్యం మెరుగుపర్చకుండా ప్రధాన కూడళ్ళలోని విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. దీనివల్ల దళితవాడలు మురికివాడలుగా మారిపోయాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల బాధితులకు న్యాయం జరగటంలేదని ప్రభుత్వం ద్వారా వచ్చే నష్టపరిహారం తక్షణమే అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మంచాల ఆనంద్, ఎస్‌కె.రహీం, కొండేటి వేణు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

బాపట్ల, జూలై 9 : పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గద్దె ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో ఎస్.నిరంజన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దగ్గుమల్లి జోసఫ్ కెనడి ఉచితంగా పుస్తకాలు అందజేయటం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది దగ్గుమల్లి భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఈవిధంగా సాయం అందించటం సంతోషదాయకమన్నారు. దాతల సహకారంతో విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆజాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం వెంకట సాంబశివరావు, ఉపాధ్యాయులు ఎ.మౌనిక, జి.నాగలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త టి.తులసీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరించిన దళితనాయకులు

బాపట్ల, జూలై 9 : కలెక్టర్ జె.వెంకటమురళీని దళిత సంఘాల నాయకులు మంగళవారం కలిసి సత్కరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు నాయకులు శీలం రోజన్‌బాబు, మంచాల ఆనంద్‌కుమార్, ఎం.రవికుమార్, కె.వేణు, ఎస్‌కె.రహీమ్ తదితరులు కలిసి కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్ళారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియా అందేవిధంగా చూడాలని కోరారు.



కలెక్టర్ వెంకటమురళీని సత్కరించి అంబేద్కర్ పటాన్ని అందజేస్తున్న డాక్టర్ చార్వాక తదితరులు

బాలికాసదన్‌లో అడ్మిషన్లు

బాపట్ల,జూలై 9 : మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాపట్లలోని అక్బర్‌పేటలో నడపబడుతున్న బాలికాసదన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని పర్యవేక్షకురాలు ఎస్.సుబ్బలక్ష్మి మంగళవారం తెలిపారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే బాలికలకు 30 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అన్నికులాల వారు 6 నుంచి 12 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలు అర్హులు అన్నారు. అనాధలు, పాక్షిక అనాధలు, ఆర్థికంగా వెనుకబడిన వారు అర్హులు అన్నారు. ఈ వసతి గృహంలో ఉచితభోజనం, ఆడుకోవటానికి ప్లేగ్రౌండ్, ఆహ్లాదకరమైన వాతావరణం, ఇతర సదుపాయాలు కల్పించబడుతుందన్నారు. అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

● కలెక్టర్ జె.వెంకటమురళీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, జూలై 9 : నిత్యవసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం రైస్,డాల్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరల తగ్గింపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ధరల నియంత్రణపై మిల్లర్ల అసోసియేషన్‌తో సమావేశమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చించటం జరిగిందన్నారు. ఆ మేరకు ధరలను తగ్గించి ప్రజలకు ఇబ్బందులు తొలిగించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రారైస్ కిలో ధర 48 రూపాయలు, స్టీమ్‌రైస్ కిలో ధర 49 రూపాయలుగా నిర్ణయించి విక్రయించాలన్నారు. కందిపప్పు కిలో 160 రూపాయలు ధర నిర్ణయించి విక్రయించాలన్నారు. జిల్లా అసోసియేషన్ నాయకులంతా ఏకగ్రీవంగా ఆమోదించటంతో ఈనెల 11వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు, రేపల్లె, వేమూరు ప్రాంతాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నిత్యవసర సరుకులు బయట మార్కెట్‌లో అధిక ధరలు ఉన్నందున ధరలు తగ్గే వరకు ప్రత్యేక కౌంటర్లు కొనసాగుతాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేయటానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కృత్రిమకొరత, డిమాండ్ సృష్టించి ధరలు పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నిత్యవసర సరుకులు అక్రమంగా నిల్వచేయటం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జనాభాలో 85 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నందున ధరలు తగ్గింపునకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మిల్లర్ల యజమానులు అంతా సహృదయంతో ప్రభుత్వానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వమే జోక్యం చేసుకొని ధరలు తగ్గించటానికి అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి విలియమ్స్, మార్కెటింగ్ శాఖాధికారి రమేష్‌బాబు, మిల్లర్ల అసోసియేషన్ నాయకులు బొమ్మిశెట్టి వెంకటరత్నగుప్తా, శ్రీనివాసరావు, హనుమంతరావు, సుజాత పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలి : కలెక్టర్

బాపట్ల, జూలై 9 : పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేయాలని అధికారులను కలెక్టర్ జె.వెంకట మురళీ ఆదేశించారు. జలవనరులు, ఆర్‌డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్, వ్యవసాయ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మంచినీటి చెరువులోని నీటిని నిబంధన ప్రకారం పరిశుభ్రపరిచి సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. కృష్ణ పశ్చిమ డెల్టా నుంచి జలాలు జిల్లాకు త్వరలో రానున్నాయన్నారు. కాల్వలలో పూడిక తీత, తూటికాడ తొలిగింపు చర్యలు వేగంగా చేపట్టాలన్నారు. వర్షాలు పడుతున్నందున రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల భూసార పరీక్షలు నిర్వహించాలని వ్యవసాయాధికారులకు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రమైన నీరు విడుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, సంబంధితశాఖాధికారులు పాల్గొన్నారు.

ఫారం జీరోలు లేకుండా ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

● ఏడీఏ రవికుమార్



వేమూరులో ఎరువుల దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

వేమూరు, జులై 9 : ఎరువుల విక్రయాలకు ఫారం జీరోలు లేకుండా అమ్మకాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ శాఖ అధికారులు మండలంలోని పలు గ్రామాలలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, ఏడీఏ రవికుమార్ వేమూరులోని పద్మావతి ట్రేడర్స్, సాయి ఎంటర్‌ప్రైజెస్, గోపిచంద్ ఏజెన్సీస్ సీడ్ దుకాణాలు, జంపనిలోని పిజిఎం, ఆగ్రోకేర్ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. బిల్లు పుస్తకాలు స్టాక్ రిజిస్టర్లు ఇన్వాయిస్ కాపీలు గోదాములో ఉన్న నిల్వలను పరిశీలించారు. విత్తనాల విక్రయాలకు చెందిన కంపెనీల సెంట్రలైజ్డ్ సీడ్ లైసెన్సులను, అందుకు సంబంధించిన పూర్తి బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విత్తనాల అమ్మకం దారులు తప్పని సరిగా సెంట్రలైజ్డ్ సీడ్ లైసెన్సులు పొంది ఉండాలన్నారు. రైతులకు అమ్మకాలు చేసే ముందు సంబంధిత రైతు వివరాలను ఆన్లైన్లో పొందుపరచి వారు కొనుగోలు చేసిన వాటికి ఆన్లైన్ రసీదులను తప్పని సరిగా ఇవ్వాలన్నారు. ఏరోజుకారోజు అమ్మకాలు నిల్వలను, ధరల పట్టికలను రైతులకు తెలిపే విధంగా తప్పని సరిగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలను మండల స్థాయిలోని వ్యవసాయ శాఖ అధికారులకు పంపాలన్నారు. అధిక ధరలకు అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి చెందిన అధికారి తిరుమలరావు, మండల వ్యవసాయశాఖ అధికారిని సునీత, లుధియాకుమారి, రమేష్‌రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

● చుండూరు, జులై 9 : మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులపై వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్లు, బిల్‌బుక్స్, సంబంధిత స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ దుకాణాదారులు కంపెనీల సెంట్రలైజ్డ్ సీడ్ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. పురుగు మందులకు సంబంధించి కంపెనీల పీసీలు ఎరువుల విక్రయాలకు సంబంధించి ఫారం ఓ తప్పనిసరిగా ఉండాలని, అవి లేకుండా అమ్మకాలు జరిపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా చుండూరు ఈకేఆర్ ఇండస్ట్రీస్ షాపునకు సంబంధించిన రూ.9,07,230 విలువైన ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను అధికారులు నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ రవికుమార్, మండల వ్యవసాయాధికారి బి.ఆదాంబాబు పాల్గొన్నారు.

● కొల్లూరు, జులై 9 : ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. కొల్లూరులోని ప్రసాద్ ఏజెన్సీ, సుమన్ ఏజెన్సీ, వినాయక్ ఎంటర్ ప్రైజెస్ దుకాణాలలో విజిలెన్స్ అధికారులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన దస్త్రాలు, రశీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పురుగుమందులకు సంబంధించిన పారిజాత ఇండస్ట్రీస్, టాటా ర్యాలీస్ కంపెనీల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో 230 కిలోలీటర్ల పురుగు మందులు వాటి విలువ రూ.5 లక్షల 51 వేల 455 లు నిల్వలను అమ్మకాలు చేయరాదని యజమానులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు దుకాణదారులను హెచ్చరించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, అగ్రి కల్చరల్ సీనియర్ అధికారి సిహెచ్ రవికుమార్, మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, టెక్నికల్ ఏవో తిరుమలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆరవ అదనపు జిల్లా జడ్జి బాలాజి

హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి

● ఆరవ అదనపు జిల్లా జడ్జి కేపీ బాలాజి

బాపట్ల, జూలై 9 : వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్, 6వ అదనపు జిల్లా జడ్జి కేపీ బాలాజి తెలిపారు. బాపట్ల కోర్టు ప్రాంగణంలో మంగళవారం కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు, ప్యానల్ లాయర్లకు, పారాలీగల్ వలంటీర్లకు ద్విచక్రవాహనాలు, ఫిలియన్ డ్రైవర్ల వినియోగదారులకు హెల్మెట్ ఉపయోగించటంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు జడ్జి కేపీ బాలాజి అధ్యక్షత వహించి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, మోటారువాహనాల తనిఖీ అధికారి ఎన్.ప్రసన్నకుమారి, ట్రాఫిక్ ఎస్సై కె.సుధాకర్, ఏజీపి ఎం.శ్యామలాదేవి పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే శ్రీబగళాముఖి అమ్మవారు : మనో

పిట్టలవానిపాలెం, జూలై 9 : భక్తుల మనస్సులో కోరిన కోర్కెలు తీర్చేఅమ్మ శ్రీబగళాముఖి అమ్మవారని సినీ ప్రముఖ గాయకులు మనో అన్నారు. మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి విచ్చేసిన ప్రముఖ సినీగాయకులు మనోకు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయనతోపాటు వారి పెద్దకుమారుడు ప్రముఖ తమిళ హీరో ధృవ, చినకుమారుడైన సంగీతగాయకులు మనోరపీ పాల్గొన్నారు. అనంతరం మనోను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆలయంలో మనో శ్రీజయజయ మహాదేవ భక్తీగీతాన్ని ఆలపించారు.

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ఘనసన్మానం

పిట్టలవానిపాలెం, జూలై 9 : బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కార్యాలయంలో మండలంలోని సంగుపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కడియాల ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి బాపట్ల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు తోలేటి నీలాంబరం మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను దుశ్శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి చెల్లించాలి : ఎస్టీయూ

కర్లపాలెం, జూలై 9 : ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ అధ్యక్షుడు వై.గుడారయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పలు పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వాన్ని నాయకులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొంతా వెంకటేశ్వర్లు, ఓ.శ్రీనివాసరావు, బి.సుబ్బారావు, ఎన్.బి.సుభానీ, బి.నాగరాజు, వి.శ్రీనివాసరావు, ఎస్.ఏసుదాను పాల్గొన్నారు.

వేధింపులపై వైద్య సిబ్బందిని విచారించిన బృందం

కొల్లూరు, జూలై 9 : వైద్యుని వల్ల వేధింపులకు గురైన వైద్య సిబ్బందిని లైంగిక వేధింపుల నిరోధక బృందం సభ్యులు విచారణ చేశారు. కొల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో మంగళవారం బృంద సభ్యులు వైద్యుని వల్ల ఇబ్బందులకు గురైన సిబ్బందిని విచారించారు. ఇదే విషయంపై వైద్యశాలలో వైద్యులను సైతం విచారణ జరిపి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి ఏ విధమైన న్యాయం కావాలని బృంద సభ్యులు అడుగగా ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఉన్నతాధికారులు వెంటనే సంబంధిత వ్యక్తులపై తక్షణ చర్యలు చేపడితే ఇలాంటి వేధింపులు మళ్లీ పునరావృతం కాకుండా ఉంటాయని, తాము స్వేచ్ఛయుత వాతావరణంలో వైద్యసేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యునిపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు జాప్యం చేయడం వల్ల ఆ వైద్యుడు ఇతర ప్రాంతానికి వెళ్లి కూడా అక్కడ నుంచి కూడా మమ్మల్ని వేధింపులకు గురి చేశాడని వాపోయారు. శాఖాపరమైన అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.



వైద్య సిబ్బందిని విచారించేందుకు వచ్చిన లైంగిక వేధింపుల నిరోధక బృందం

కార్మికుల ఆందోళన విజయవంతం చేయాలి

భట్టిప్రోలు, జూలై 9 : దేశవ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఈనెల 10న జరిగే ఆందోళన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రమాదేవి కోరారు. స్థానిక కార్యాలయం వద్ద మంగళవారం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా ఉన్న లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ఉత్తర్వులను జారీ చేయడానికి సిద్ధపడుతుందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, మున్సిపాలిటీ, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర పథకాల కార్మికులను ప్రభుత్వం గుర్తించి కనీసం వేతనం నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ స్కీంను అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధనకే మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రమాదేవి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురుగుడు సత్యనారాయణ, పి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

కొల్లూరు, జూలై 9 : ఎస్సీ కాలనీలో కల్వర్టు నిర్మాణానికి సర్పంచ్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. కొల్లూరులోని జగజ్జీవన్‌రామ్ కాలనీలో మంగళవారం గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.25 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ధూళిపూడి కృష్ణ, కార్యదర్శి మల్లిఖార్జున, సభ్యులు మహేష్, దుర్గా ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను సత్కరిస్తున్న బాపట్ల, గుంటూరు జిల్లాల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు.

ఎమ్మెల్యే నరేంద్రవర్మకు కెమిస్ట్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అభినందనలు

బాపట్ల, జూలై 9 : మెడికల్ స్టోర్‌లో పని చేసి వ్యాపారవేత్తగా, ఎమ్మెల్యేగా ఎదిగిన వేగేశన నరేంద్రవర్మను మంగళవారం బాపట్ల, గుంటూరు జిల్లాల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మంచి సేవకునిగా ఉన్న ఆయన నాయకునిగా ప్రజలకు మరెన్నో సేవలు చేయాలని వారు ఆకాంక్షించారు. అసోసియేషన్‌కు అన్నివిధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే నరేంద్రవర్మ తెలిపారు. ఈసందర్భంగా నరేంద్రవర్మను సత్కరించి సన్మానించారు. నోట్‌పుస్తకాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరకుమార్, కోశాధికారి జె.సూర్యనారాయణ, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్, కోశాధికారి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు బొమ్మిశెట్టి నరసింహమూర్తి, తటవర్తి సాంబశివరావు, నాగవరపు పవన్‌కుమార్, గెల్లి దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా బాపట్ల అంజుమన్-ఎ-ఇస్లామియా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. షాదీఖాన మీదగా ఉన్న విద్యుత్ తీగలు తొలిగించే విధంగా చూడాలని అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీంజానీ ఎమ్మెల్యేను కోరారు. అంజుమన్ సమస్యలను వివరించారు. కమిటీకి అండగా ఉంటానని నరేంద్రవర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాజి, కార్యదర్శి షేక్ కరీం, రఫీ, మీరా సాహేబ్, మాజీ అధ్యక్షుడు షేక్ జిలానీ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనేకమంది నరేంద్రవర్మను కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు.

స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ చేస్తే చర్యలు : ఆర్డీవో

రేపల్లె, జూలై 9 : గర్భిణులు స్కానింగ్ సెంటర్‌లో ఆడ, మగ పిల్లల ముందస్తుగానే నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పూర్వా పిండలింగ నిర్ధారణ చట్టం కింద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భ్రూణ హత్యలు జరగకుండా నివారించాలని, ఆడపిల్లల నిష్పత్తిని పెంచాలని కోరారు. ప్రైవేటు వైద్యశాలలో స్థానిక కేంద్రాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అర్హులైన వైద్యుని సలహాల మేరకే గర్భవతులు స్కానింగ్ తీయించుకోవాలని తెలియజేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, రత్నశ్రీ, ఏపీపీ పిఎస్‌బీ శర్మ, సిఐ నజీర్‌బేగ్, డాక్టర్ వీరరాఘవయ్య, ఎన్‌జీవో ప్రభాకర్, సుధాకర్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారోన్

అతిసార వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

రేపల్లె, జూలై 9 : అతిసార వ్యాధిపై విద్యార్థినీ, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నాగార్జున అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి హైస్కూల్లో విద్యార్థులకు అతిసార వ్యాధి నుంచి పిల్లలను రక్షించండి అంటూ మంగళవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండటంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షితమైన నీరును తాగాలని, వేడి పదార్థాలను తినాలని సూచించారు. ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అతిసార వ్యాధి వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణవి, విజయసుశీల, మురళి, మాధవి, ఏఎన్‌ఎంలు, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్‌బీకే కేంద్రాల్లో సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

భట్టిప్రోలు, జూలై 9 : రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.మీరయ్య తెలిపారు. మండలంలోని సూరేపల్లి గ్రామంలో మంగళవారం వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సూరేపల్లి, ఐలవరం ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 25 కేజీల బీపీటీ 5204 రకం వరి విత్తనాల బస్తా రూ.920లకు ఆర్‌బీకే కేంద్రాల్లో అందజేస్తున్నామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతాంగం బిల్లులు, బ్యాగులను భద్రపరచుకోవాలని ఆయన సూచించారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయడం వలన నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. వెదపద్ధతిలో వరి సాగు చేసే రైతాంగం 48 గంటల లోపు పెండిమిథాలిన్ ఒక ఎకరాకు ఒక లీటరు చొప్పున స్ప్రే చేయాలని మీరయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు గోవర్ధనగిరి సుధాకర్, బొర్రా శరాబంది, సాంబయ్య, వీఏఏ నఫీసా, ఎంపీఈఓ నరేష్ పాల్గొన్నారు.



సూరేపల్లిలో వరి విత్తనాలను అందజేస్తున్న ఏఓ మీరయ్య

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

అమృతలూరు, జూలై 9 : అమృతలూరులో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తర ఎస్సీ కాలనీకి చెందిన మానుకొండ దిలీప్ కుమార్ (38) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఉన్నాడు. మంగళవారం ఉదయం తన భార్య మరియమ్మకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని తెలిపాడు. స్థానిక హిందూ అపరకర్మశాల వద్ద ఒక వ్యక్తి పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామంలో తెలియడంతో దిలీప్‌గా గుర్తించారు. భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను పరాధీనం కానివ్వం

వేటపాలెం(చీరాల), జూలై 9 : ప్రభుత్వానికి సబంధించి సెంటు భూమి కూడా పరాధీనం కానివ్వమని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి దత్తక్షేత్రంలో నిబంధనలకు విరుద్ధంగా నివేశన స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌కు ప్రజా పరిష్కారాల వేదికలో సోమవారం కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ కృష్ణకాంత్, ల్యాండ్స్ అండ్ ఫైన్స్ సర్వే బాధ్యుడు మునలయ్య తదితరులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ నివేదికను పారదర్శకంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి, నీటి పన్నులను త్వరితగతిన వసూళ్లు చేయాలి

చీరాలటౌన్, జూలై 9 : పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలను త్వరితగతిన పూర్తి చే యాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మునిసిపల్ పరిధిలోని రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లకు సంబంధించిన లీజులు, షాపుల అద్దెలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషనా.. మద్యం దుకాణమా!

- కొప్పెరపాడులో అర్ధరాత్రి మందు పార్టీలో సిబ్బంది
- సరఫరా ఎందుకు లేదని ప్రశ్నించిన ప్రజలపై దౌర్జన్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

బల్లికురవ, జూలై 9: గ్రామాలలో మెరుగైన విద్యుత్ అందించేందుకు ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లు మద్యం దుకాణాలను తలపిస్తున్నాయి. అక్కడ పనిచేసే సిబ్బంది రాత్రి పూట కొందరిని పిలిపించుకొని మద్యం పార్టీలతో మునిగి తేలుతున్నారు. విద్యుత్ సరఫరా లేదని ఫోన్ చేసిన వినియోగదారులపై తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతున్నారు. అదేమంటే దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దబాయిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది మందు పార్టీని చూసిన ప్రజలు అవాక్కు అవుతున్నారు.

బల్లికురవ మండలం కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి మందు పార్టీని ఏర్పాటుచేసుకొని చిందులు వేయటం విమర్శలకు తావిస్తుంది. రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో వైదన గ్రామానికి చెందిన కొందరు యువకులు కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. సుమారు గంటన్నర అయినా విద్యుత్ రాలేదని వారు అక్కడికి వెళ్లగా.. విధులలో ఉన్న సిబ్బంది మందు పార్టీలో మునిగి ఉన్నారు. సబ్‌స్టేషన్‌లో మద్యం తాగటం ఏమిటి, ఫోన్ చేసిన ఎందుకు సమాధానం చెప్పటం లేదని ప్రశ్నించారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఒక పూట విద్యుత్ లేకపోతే ఎవరు చచ్చిపోరులే అంటూ దుర్భాషలకు దిగారు. విధులలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన సిబ్బంది మద్యం తాగటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సబ్‌స్టేషన్లపై అధికారులు పర్యవేక్షణ సరిగా చేయటం లేదని, కొప్పెరపాడు సబ్‌స్టేషన్‌లో కొంతకాలం నుంచి పేకాట కూడా ఆడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బంది రైతుల నుంచి కూడా పెద్ద ఎత్తున వ్యవసాయ సీజన్‌లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది మద్యం తాగి పార్టీ చేసుకొన్న విషయమై వైదన గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు వాట్సప్ ద్వారా ఫొటోలను పెట్టి ఫిర్యాదు కూడా చేశారు. సబ్‌స్టేషన్‌ను మద్యం దుకాణంలా మార్చిన సిబ్బందిపై వెంటనే విచారణ చేపట్టి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈవిషయమై ఏఈ శ్రీనివాసరావును ఫోన్‌లో వివరణ కోరగా, సబ్‌స్టేషన్‌లో సిబ్బంది మద్యం తాగుతున్న సంఘటనను వైదన గ్రామస్థులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.



సబ్‌స్టేషన్‌లో మందు పార్టీ చేసుకొంటున్న సిబ్బంది



కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

బల్లికురవ, జూలై 9: మండలంలోని అంబడిపూడి బీసీ కాలనీ వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో గృహాలకు వెళ్లే విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. హుటాహుటీన విద్యుత్ సిబ్బంది మంగళవారం విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. బల్లికురవ - అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులో అంబడిపూడి గ్రామం వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఒక స్తంభం పడిపోయి పక్కనే ఉన్న మరో రెండు స్తంభాలపై పడిపోవటంతో విరిగి పడిపోయాయి. రాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకుంటే ప్రజలపై పడిపోయేవని పలువురు పేర్కొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

అద్దంకిటౌన్, జూలై 9: గ్రామంలో 6 నుండి 14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలు పాఠశాలలోనే ఉండాలని సీఆర్పీ ఎం.రమేష్ అన్నారు. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. మంగళవారం మండలంలోని కొటికలపూడి ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం హెచ్ఎం సీహెచ్ వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఆర్పీ రమేష్ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి 5 సంవత్సరాలు పూర్తయిన 8 మంది పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు.. అలాగే, డయేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ అందించే స్టూడెంట్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిందుడ్రులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి

అద్దంకిటౌన్, జూలై 9: సేంద్రియ పద్ధతుల్లో తయారుచేసే వస్తువులపై అవగాహన కలిగి ఉండి ఇతరులకు తెలియజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, వాణిజ్య శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో ఆయా విభాగాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలు పీవీ హేమలత, రామకృష్ణ, డాక్టర్ మస్తాన్‌వలి, కామర్స్ విభాగాధిపతి ఏ.శిఖామణి, వృక్షశాస్త్రం అధ్యాపకులు డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీని పరామర్శించిన డాక్టర్ దగ్గుబాటి



కేవీ సుబ్బారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు

పంగులూరు, జూలై 9: మాజీ జడ్పీటీసీ కేవీ సుబ్బారావును మంగళవారం డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొంది చందలూరులో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కేవీని డాక్టర్ దగ్గుబాటి కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేవీ కుటుంబ సభ్యులందరినీ పేరుపేరున పలకరించారు. ఆహార నియమాలు పాటించి ఆరోగ్యం కుదుటపడే వరకు విశ్రాంతి తీసుకోవాలని కేవీ సూచించారు. ఈసందర్భంగా గత సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ సరళిని, రాజకీయ పరిస్థితులను స్థానిక నేతలతో ముచ్చటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కందిమళ్ళ రామాంజనేయులు, పెంట్యాల రామాంజనేయులు, అడ్డగడ సతీష్ పాల్గొన్నారు.

పెదగంజాంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

చినగంజాం, జూలై 9: మండలంలోని పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 5.0ఎంవీఏ విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌ను చీరాల విద్యుత్ శాఖ ఈఈ కె.జాన్‌థామస్ మంగళవారం టెక్నికల్‌గా చార్జ్ చేసినట్లు చిన గంజాం ఏఈఈ పడవల గణనారాయణ తెలిపారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో 5.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫారాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ఇచ్చినట్లు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు లోవోల్టేజీ సమస్య తీరుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు జె.శ్రీనివాసులు, గురునాథం, ఎ.శ్రీనివాసరావు, టి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

చీరాలటౌన్, జూలై 9: నూతనంగా అమలుచేస్తున్న చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని వన్‌టౌన్ ఎస్ఐ హరిబాబు అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రయాణికులకు డ్రైవింగ్ చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎస్‌డీ మదీన్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పక పాటించాలి

చీరాలటౌన్, జూలై 9: రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలని జిల్లా వనరుల కేంద్రం(డీడీఏ) అధికారి ఎం.విజయనిర్మల అన్నారు. మంగళవారం చీరాల మండల వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం, మట్టి నమూనా పరీక్షలపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం, సమతుల్య ఎరువులు, యాజమాన్యం పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలను సాగుచేసే క్రమంలో ఖర్చు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్తలు ఉషారాణి, రాధాకృష్ణ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న వేరుశనగ పంటలలో వచ్చే వివిధ చీడపీడల నివారణ, తెగుళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో అధికారులు మురళీధర్ నాయక్, రత్నకుమారి, భారతి, భాస్కరరావు, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

దేవాంగపురి పంచాయతీ కార్యదర్శిపై విచారణ

చీరాల టౌన్, జూలై 9 : చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీపై డీఎల్‌పీవో దారా హనుమంతరావు మంగళవారం విచారణ జరిపారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేశారు. వివిధ అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేశారు.

11న దేవదాయ భూముల కౌలు వేలం

పర్చూరు, జూలై 9: పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం, అన్నంబొట్లవారిపాలెం, గర్నెపూడి గ్రామాల్లో గల దేవదాయ భూములకు సంబంధించి ఈనెల 11న బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అధికారి టి.శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంకు చెందిన భూముల కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే, అన్నంబొట్లవారిపాలెం, గర్నెపూడి గ్రామాల్లోని భూములకు కూడా ఆయా గ్రామాల్లో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగి న రైతులు రూ.5వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పంగులూరు, జూలై 9: మండలంలోని ముప్పవరం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలు తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడినట్లు పర్చూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తెలిపారు. మంగళవారం తన సిబ్బందితో ముప్పవరం వద్ద ఆమె వాహన తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పర్చూరు వైపు నుండి జాతీయ రహదారివైపు బియ్యం లోడుతో వస్తున్న వాహనంలో 55 బస్తాల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు.

బియ్యం లోడుతో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని మేదరమిట్లలోని రైస్ మిల్లుకు తరలించారు. అందులో ఉన్న 55 బస్తాల బియ్యాన్ని మేదరమిట్లలో డీలర్‌కు అప్పగించినట్టు చెప్పారు. లారీని రైస్ మిల్లులో ఉంచి డ్రైవర్‌ను రేణంగివరం పోలీసు లకు అప్పగించినట్లు డీటీ గీతారాణి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.. .

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

పంగులూరు, జూలై 9: మండలంలోని మూడు గ్రామాలలో బుధవారం ఆలయభూముల కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు తెలిపారు. చినమల్లవరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములు, బూదవాడ గ్రామంలో ఆలయంకు చెందిన భూములు, జాగర్లమూడివారిపాలెంలో ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు రూ.మూడు వేలు దరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని ఈవో శ్రీనివాసరావు కోరారు.



రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అద్దంకిటౌన్, జూలై 9: ప్రావిడెండ్ ఫండ్‌కు సంబంధించి హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘ రాష్ట్ర నాయకుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక చిన్ని శాంతయ్య సేవా సదన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, అద్దంకి డిపో ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్ టి.శ్రీనివాసరావు అభినందన సభ పీసీహెచ్ కోటయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర, రీజనల్ నాయకులు వి. వెంకటేశ్వర్లు, సీహెచ్ చంద్రశేఖర్, ఎంకే రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొని శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎం.హనుమంతరావు (చిన్న), రీజియన్ నాయకులు వీవీ బ్రహ్మం, వై.వెంకటేశ్వర్లు, ఎస్‌కే కాలే మస్తాన్, పల్లెపోగు స్టీఫెన్, కె.నరసింహరావు, జె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో ఊపందుకుంటున్న నిర్మాణరంగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 9: సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన ప్రకారం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ఉచిత ఇసుక విధానాన్ని అమలుపరిచారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. దీంతో నిర్మాణరంగం ఊపందుకుని అందరికి ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. సోమవారం రాత్రి నిర్మాణరంగ ప్రతినిధులు, కార్మిక ప్రతినిధులు, తదితరులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకపైన విధించిన ఆంక్షలతో నిర్మాణ రంగంతో పాటు, ఆ రంగానికి అనుబంధంగా ఉంటే ఉపవృత్తులవారు తీవ్ర సంక్షోభానికి గురయారన్నారు. ఇసుకను సంబంధించి సీనరేజి, బాడుగ మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. దీంతో అన్ని వర్గాలకు పార్టీలకు అతీతంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ విభాగాల వృత్తి పనివారు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు!

చీరాల, జూలై 9: ఎప్పుడు కూడా ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉండాల్సిన వ్యక్తులు, వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలని బీజేపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. అబద్ధాలను వండి వారిస్తే నిజాలు కావన్నారు. అబద్ధాలను ప్రచారం చేసే ప్రయత్నాన్ని ప్రజలు స్వాగతించరని చెప్పారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండయ్య పై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి పదిహేను రోజులుగా కూడా పూర్తికాకుండానే ఆరోపణలకు దిగేవారి చిత్తశుద్ధి, విచక్షణకు వదిలేస్తూ, వారు పునరాలోచించుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణారావు, అర్వపల్లి కుమార్, నాగేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, మణి, జనసేన నాయకులు గూడూరి శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, జూలై 9: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో సమస్యల తక్షణ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కమిషనర్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో పెదగానుగపాలెంలో మంగళవారం పారిశుధ్య పనులు, సైడ్ డ్రైన్‌లు, నిలిచిన వర్షపు నీటిని కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

అద్దంకి, జూలై 9: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో గత మూడు సంవత్సరాలు గా అభివృద్ధి పనులకు నోచుకోని టీడీపీ కౌన్సిలర్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని టీడీపీ కౌన్సిలర్‌లు మంగళవారం కమిషనర్ సత్యనారాయణ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా వార్డులలో చేయాల్సిన పనులు గురించి వివరించారు. కమిషనర్ ను కలిసిన వారిలో కౌన్సిలర్‌లు కంపా రజనీ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్, మాగులూరి తిరుపతమ్మ, విజయలక్ష్మి, సీతమ్మ, జహీరా తదితరులు ఉన్నారు.

కొరిశపాడులో చోరీ

మేదరమెట్ల, జూలై 9: మండలకేంద్రమైన కొరిశపాడులో సోమవారం దొంగతనం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ పనికి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లిచూడగా బీరువా పగులగొట్టి ఉంది. అందులోని రూ.20వేలు నగదు, రూ.30వేలు విలువైన బంగారం కనిపించలేదు. మంగళవారం ఉదయం నూర్జహాన్ ఘటనపై కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.శివయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు

- పోటీపడుతున్న పలువురు నేతలు



అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

అద్దంకి, జూలై 9: నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలతో పాటు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్, డైరెక్టర్‌ల పోస్టులకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. అద్దంకి మార్కెట్ కమిటీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు, సంతమాగులూరు మార్కెట్ కమిటీ పరిధిలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలు ఉన్నాయి. దీంతో ఆయా పరిధిలోని నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్లలో కూరగాయల సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో పాలకమండలి కనుసన్నలలో సంత నిర్వహణ జరిగే అవకాశం ఉండటంతో కనీసం డజను మందికి పని కల్పించే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలు నిర్వహణకు కూడా అవకాశం ఉంది.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలికి కూడా మంచి గుర్తింపు ఉంటుంది. అదే సమయంలో ప్రస్తుతం సుమారు రూ.7 కోట్లతో దేవాలయం అభివృద్ధి పనులు కూడా జరుగుతుండటంతో పాలకమండలికి మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇక అవుట్ సోర్సింగ్ ద్వారా సుమారు 15 నుంచి 20 మంది సిబ్బందికి అవకాశం కల్పించే అవకాశం కూడా ఉంది. అదే సమయంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇతర పలు దేవాలయాలకు కూడా కమిటీలు వేయనున్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం పాలకమండలి ఛైర్మన్‌గా గత కొన్ని దశాబ్దాలు గా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు ఆనవాయితీగా కేటాయిస్తున్నారు. ఈనేపథ్యంలో అద్దంకి పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు ఇప్పటికే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. డైరెక్టర్‌లుగా మిగిలిన సామాజిక వర్గాలకు కేటాయించే అవకాశం ఉండటంతో ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, నామినేటెడ్ పదవుల ఆశించే నేతలు ఎక్కువగా ఉండటం తో ఎంపిక మంత్రి రవికుమార్ కు ఒకింత కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో మంత్రి బాధ్యతలతో రవికుమార్ బిజీగా ఉండటంతో పదవుల పంపకం ఒకింత ఆలస్యం అయ్యే కానున్నట్లు తెలుస్తుంది.

వైభవంగా ముగిసిన గంగమ్మ కొలుపులు



పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చినగంజాం, జూలై 9: మండలంలోని కడవకుదురులో గంగమ్మ అమ్మవారి కొలుపులు మంగళవారం వైభవంగా ముగిశాయి. గ్రామంలో ఆదివారం నుంచి అమ్మవారికి పలు రకాల పూజలు నిర్వహిస్తూ, మంగళవారం పొంగళ్ళు. కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. గంగమ్మ అమ్మవారి ప్రభ ముందు, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో, మహిళలు నెత్తి మీద పొంగళ్ళు పెట్టుకొని, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మంగళవారం సాయంత్రం అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఈసందర్భంగా ఆలయ పూజారి హైమారావు గంగమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అమ్మవార్ల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నక్కల పెదముత్తయ్య, యంపరాల రోశయ్య, యాదవ పెద్దలు, శ్రీకృష్ణా యాదవ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతోపాటు వసతులు కల్పించాలి



బధిరుల పాఠశాల విద్యార్థులతో కమిషన్ సభ్యులు, సిబ్బంది

పర్చూరు, జూలై 9: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, మౌలికవతులు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని నాగులపాలెం బధిరుల పాఠశాలను ఆకస్మిక తనిఖీచేశారు. వంటశాల, భోజన గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల నిర్వహణ, వసతుల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, సీడీపీవో సుభద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

యద్దనపూడి(మార్టూరు), జూలై 9: యద్దనపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు సరైన మౌలికవసతులు లేవని ఆమె గుర్తించారు. విద్యార్థినులకు భోజనం తయారుచేస్తున్న వంట గదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు స్కూల్ ఆవరణలో విషసర్పాలు వస్తున్నాయని పలువురు విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను నెలలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివసుబ్రమణ్యం, ఎంఈవో గోపి, సీడీపీవో సుభద్ర, సూపర్‌వైజర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీలో ఇష్టారాజ్యం

- గ్రామీణ సర్వీసులతో పాటు పలు నగరాలకు బస్సులు రద్దు
- ఆదివారం వస్తే అత్యధిక వాహనాలకు విశ్రాంతే



ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, జూలై 9: అద్దంకి ఆర్టీసీ అంతా అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో రోజురోజుకు అద్దంకి ఆర్టీసీ డిపోలో బస్సుల సంఖ్య తగ్గిపోతుంది. ఈక్రమంలో అద్దంకి డిపోలో నా లుగు దశాబ్దాలుగా నడుస్తున్న పలు గ్రామీణ సర్వీసులు పూర్తిగా తొలగించారు. అదే సమయంలో ప్రధాన నగరాలకు అద్దంకి డిపో నుంచి బస్ సర్వీసులు లేవంటే ఆశ్చర్యం కలుగక మానదు. ప్రధాన రూట్లు అయిన నర్సరావుపేట, వినుకొండ, పొదిలి, ఒంగోలు రూట్లలో మాత్రమే పల్లెవెలుగు బస్సులు అత్యధిక శాతం నడుస్తున్నాయి. ఇక విజయవాడ, శ్రీశైలంకు మాత్రమే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పరిమితం అయ్యాయి.

దశాబ్దాల కాలం నుంచి నడిచిన అద్దంకి - మారెళ్ల, కొండమంజులూరు, బొద్దికూరపాడు, కుందుర్తి, చిలకలూరిపేట, బల్లికురవ - చిలకలూరిపేట, పమిడిపాడు, బి.నిడమానూరు, కనిగిరి - కందుకూరు, ఇసుక పాలెం, మైలవరం, మణికేశ్వరం, ఉప్పుగుండూరు, ఈదర, ఇంకొల్లు - గుంటూరు - విజయవాడ తదితర రూట్లలో నిత్యం తిరిగే బస్ సర్వీసులు రద్దు అయ్యాయి. కొన్ని రూట్లలో మాత్రం మొక్కుబడిగా ఉదయం, సాయంత్రం సమయాలలో నడుపుతున్నారు. ఇక ప్రధాన నగరాలు అయిన చెన్నై, బెంగళూరుకు, ఆధ్యాత్మిక నగరం అయిన తిరుపతికి అద్దంకి డిపో నుంచి కనీసం ఒక్క బస్ సర్వీసు కూడా లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. దశాబ్దాలుగా నడుస్తున్న పమిడిపాడు-హైదరాబాద్ బస్‌ను రద్దు చేసి మొక్కుబడిగా మేదరమెట్ల, పమిడిపాడు, చందలూరు, పంగులూరు మీదుగా ఒక సర్వీసును నడపడం ద్వారా ప్రయోజనం ఏమిటని పలు గ్రామాల ప్రయాణికులు అంటున్నారు. అద్దంకి నుంచి శ్రీశైలంకు ఏడు సర్వీసులు నడుస్తున్నా అద్దంకి నుంచి వెళ్లే భక్తులకు ఏ మాత్రం ఉపయోగపడే అవకాశం లేదు. ఒంగోలు మీదుగా నడుపుతుండడంతో ఎక్కువ దూరం, ఎక్కువ చార్జి భరించాల్సి రావడంతో అద్దంకి ప్రాంత ప్రయాణికులు పొదిలి లేదా వినుకొండ వెళ్లి వేరే బస్సులలో వెళ్తున్నారు. కనీసం కొన్ని సర్వీసులు అయినా వయా దర్శి పొదిలి లేదా వినుకొండ మీదుగా నడిపితే అద్దంకి ప్రాంత ప్రయాణికులు ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొవిడ్ తరువాత బస్ సర్వీసులను పునరుద్ధరించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

వారంలో మూడు రోజులు సర్వీసులు రద్దు

అద్దంకి డిపో నుంచి పలు రూట్లలో నడిచే సర్వీసులలో ఏ రోజు ఏ సర్వీసు నడుస్తుందో ప్రజలకు అర్థంకాని పరిస్థితి. ప్రీ ప్లాన్ కాన్సిలేషన్ (పీపీసీ) పేరుతో పలు సర్వీసులను రద్దు చేస్తున్నారు. వారంలో మూడు రోజులు (ఆది, మంగళ, శుక్రవారం) పీపీసీ పేరుతో అర్థాంతరంగా రద్దు చేస్తున్నారు. బస్సులు రద్దు చేసిన విషయాన్ని కనీసం బస్టాండ్ ఆవరణలో సమాచార బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులను తీవ్ర ఇబ్బందికి గురిచేస్తోంది. ఆదివారం వచ్చిందంటే కనీసం పది బస్సులు పీపీసీలో ఉంటాయి. ప్రధానంగా గ్రామీణ రూట్లలో తిరిగే సింగిల్ రూట్ సర్వీసులు కూడా రావు. తాళ్లూరు, బొద్దికూరపాడు, మైలవరం, కొమ్మినేనివారిపాలెం - చిలకలూరిపేట, బాపట్ల తదితర రూట్లలో ఆదివారం బస్ సర్వీసులు రద్దు చేస్తున్నారు. గతంలో అద్దంకి డిపో నుంచి పలు గ్రామాలకు నైట్ హాల్ట్ సర్వీసులు కనీసం డజను పైనే ఉండేవి. ప్రస్తుతం రెండు మా త్రమే నడుపుతున్నారు. బల్లికురవ మీదుగా చిలకలూరిపేట నైట్‌హాల్ట్ బస్ సుమారు నాలుగు దశాబ్దాలుగా ఉండగా ఇటీవల రద్దు చేశారు. అలాగే, వైదన మీదుగా చిలకలూరిపేట సర్వీసు ఉదయం మా త్రమే నడుపుతుండటంతో అద్దంకి వచ్చిన ప్రయాణికులు సాయంత్రం ఇళ్లకు చేరేది ఎలా అని అధికారులకే తెలియాలి. ఇదే పరిస్థితి కొంతకాలం గడిస్తే అద్దంకి డిపోను సైతం రద్దు చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం అటు ప్రజలు, ఇటు ఆర్టీసీ ఉద్యోగులలో నెలకొంది. అధికారుల అనాలోచిత నిర్ణయాల వలనే ఈ పరిస్థితి ఏర్పడింది.ఇప్పటికే బల్లికురవ, పంగులూరు మండలాల ప్రజలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ఆర్టీసీ బస్సులు రద్దు చేసిన విషయాన్ని తీసుకెళ్లారు.